www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 13 జులై 2023
5
తిరుపతి

ఎస్వీ ఆయుర్వేద కళాశాల
విద్యార్థులకు అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి -క్యాంపస్: ఎస్వీ ఆయుర్వేద కళాశాలలో బిఏఎంఎస్ చివరి సంవత్సరం పరీక్షల్లో మొదటి, రెండవ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు బుధవారం హిమాలయ వెల్‌నెస్ సంస్థ అవార్డులు, నగదు బహుమతులు ప్రదానం చేసింది కళాశాలలో అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. మొదటి ర్యాంకు సాధించిన కుమారి కెఎం.అజూషకు జీవక అవార్డు, రూ.15వేల నగదు బహుమతిని అందజేశారు. రెండో ర్యాంకు సాధించిన కుమారి టిసి.వర్షితకు ఆయుర్విశారద అవార్డు, రూ.10 వేలు నగదు బహుమతి అందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మురళీకష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు ఇలాంటి అవార్డులు ఇవ్వడం ద్వారా మరింత మంది ఉత్తమమార్కులు సాధించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. హిమాలయ వెల్ నెస్ సంస్థ ప్రతినిధులు డాక్టర్ ముబారక్, ఎల్లయ్య, కళాశాల వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ సుందరం, ప్రొఫెసర్లు డాక్టర్ జ్ఞానప్రసన్న, డాక్టర్ చంద్రకిషోర్, పాల్గొన్నారు.

చంద్రయాన్-3 కౌంట్‌డౌన్ ప్రారంభం

- 9 రోజుల వ్యవధిలోనే మళ్లీ ఇంకో ప్రయోగం
- 13న మధ్యాహ్నం 2.35 గంటలకు కౌంట్ డౌన్ ప్రక్రియ ప్రారంభం

ప్రజాశక్తి-సూళ్లూరుపేట:
చంద్రయాన్-3 ప్రయోగంతో భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం శ్రీహరికోట సందడిగా ఉంది. అత్యంత భద్రత ప్రదేశమైనా ఈ రాకెట్ ప్రయోగ కేంద్రం ప్రస్తుతం కీలకమైన చంద్రయాన్-3 ప్రయోగంతో మరింత పటిష్టమైనది. షార్ అడవుల్లో సిఐఎస్ఎఫ్ దళాలు కూబింగ్ నిర్వహిస్తున్నారు. సూళ్లూరుపేట, శ్రీహరికోట మార్గంలోను, షార్‌లోని మొదటి, రెండవ గేట్ల వద్ద, లాంచ్ ప్యాడ్ వరకు అడుగడుగున తనిఖీలు నిర్వహిస్తున్నారు. కేంద్ర పారిశ్రామిక భద్రతా దళాలు, కోస్ట్ గార్డ్ గస్తీ తీవ్రం చేశారు. మూడు రోజులు ముందు నుంచే షార్ భద్రతా వలయంలో ఉంది. 13వ తేదీ గురువారం మధ్యాహ్నం 2.35గంటలకు కౌంట్ డౌన్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఇది నిరంతరం 24 గంటల పాటు కొనసాగుతుంది. ఎంఆర్ఆర్ సమావేశాలు బుధవారం నిర్వహించారు.

కౌంట్‌డౌన్‌కు సిద్ధమవుతున్న చంద్రయాన్ -3

ఇదిలా ఉంటే శ్రీహరికోటలో చంద్రయాన్-3 ప్రయోగ తుది ఏర్పాట్లు ఒకవైపు జరుగుతుంటే మరోవైపు పిఎస్ఎల్వి సి-57 రాకెట్ ప్రయోగం జరపడానికి శాస్త్రవేత్తలు సిద్ధమవుతున్నారు. ఈనెల 14న మధ్యాహ్నం 2.35 గంటలకు చంద్రయాన్-3ని సెకండ్ లాంచ్ ప్యాడ్ నుంచి ప్రయోగిస్తున్నారు. అనంతరం తొమ్మిది రోజుల వ్యవధిలోనే ఈనెల 23న ఉదయం 6.30 గంటలకు పిఎస్ఎల్వీ సి-57 రాకెట్‌ను ఫస్ట్ లాంచ్ ప్యాడ్ నుంచి ప్రయోగించడానికి సమాయత్తం అవుతున్నారు. ఈ రాకెట్ ద్వారా సింగపూర్, మలేషియా వంటి దేశాల కమర్షియల్ శాటిలైట్లను అంతరిక్షంలోకి చేర్చబోతున్నారు. ఒకేసారి షార్‌లో ఐదు రాకెట్లను అనుసంధానం చేసుకునే సౌకర్యాలు ఉన్నాయి. మరో రెండు రాకెట్లు మొదటి, రెండవ ప్రయోగ వేదికలపైకి చేర్చి తుది పరీక్షలు జరుపుకోవడానికి కూడా అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో షార్‌లో కేవలం చంద్రయాన్-3తో సరిపెట్టుకోకుండా పదేపదే లాంచింగ్‌లు జరపడానికి శాస్త్రవేత్తలు రేయింబవళ్ళు శ్రమిస్తున్నారు.

భారతీయ సంస్కృతి, సాహిత్యానికి మూలం
సంస్కృత భాష

కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్



ప్రజాశక్తి - క్యాంపస్:
భారతీయ సంస్కృతి, సాహిత్యానికి మూలం సంస్కృత భాష అని కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ పేర్కొన్నారు. మూడు రోజులు పాటు నిర్వహించే జాతీయ సమ్మేళనాన్ని మినిస్ట్రీ ఆఫ్ కల్చర్, సాహిత్య అకాడమీ ఢిల్లీ, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం తిరుపతి, సంస్కృతి ఫౌండేషన్ మైసూర్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం వర్సిటీ ఓపెన్ ఆడిటోరియంలో సంస్కృతం జాతీయస్థాయి సమ్మేళనాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సమ్మేళనానికి ముఖ్యాతిథిగా విచ్చేసిన కేరళరాష్ట్రం గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ మాట్లాడుతూ జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వర స్వామివారి పాదాల కింద విరిసిల్లుతున్నదని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృత భాష గొప్పతనాన్ని వర్ణిస్తూ ఈ సంస్కృత భాష సనాతన ధర్మానికి, సాంస్కృతికకు, ఆదర్శ జీవనవిధానానికి ఎంతో ప్రాముఖ్యమైనదని వివరించారు. సంస్కృత భాషద్వారానే భారతీయ సంస్కృతి ఈ రోజుకు మనుగడ సాగిస్తుందని తెలిపారు. కేరళ రాష్ట్రంలోని ఆదిశంకరాచార్యులు భారతదేశంలోని నలుదిక్కులా నాలుగు మఠాలను ఏర్పాటుచేసి తద్వారా సంస్కృత జ్ఞానాన్ని నలుదిశలా వ్యాపింపజేశారని తెలిపారు. భారతదేశం సంస్కృతీ, సాంప్రదాయాలు పరంగా, ఆధ్యాత్మికతా పరంగా భిన్నమైనపప్పటికీ మనమంతా ఒక్కటే అన్నారు. వసుధైవ కుటుంబకం అనే నానుడి సంస్కృతభాష ద్వారానే వెల్లడవుతుందని వివరించారు. ఇటువంటి జాతీయ సమ్మేళనాల ద్వారా సంస్కృత భాష సామాన్య జనానికి మరింత చేరువవుతుందని వివరించారు.

జాతీయ సదస్సులో మాట్లాడుతున్న కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్

జనసేన నేతకు సీఐ చెంపదెబ్బలు..!

- జనసేనులను హౌజ్ అరెస్టు చేసిన పోలీసులు

సిఎం దిష్టిబొమ్మను ఇంటి ఆవరణలో దహనం చేస్తున్న వినుత

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:
జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ దిష్టి బొమ్మను దగ్ధం చేయడాన్ని నిరసిస్తూ ఆ పార్టీ శ్రేణులు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ దిష్టిబొమ్మను తగలబెట్టే ప్రయత్నాన్ని బుధవారం పోలీసులు భగ్నం చేశారు. ఆ పార్టీ నాయకులను ఎక్కడికక్కడ హౌజ్ అరెస్టులు చేసి నిర్బంధించారు. అయినా కూడా కొందరు జనసేన నాయకులు జగన్ దిష్టి బొమ్మను తగలబెట్టే ప్రయత్నం చేయడంతో పోలీసులు చెదరగొట్టి పోలీసుస్టేషన్‌కు తరలించారు. జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇంఛార్జి వినుత కోటా ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణంలోని పెళ్లిమండపం వద్ద సిఎం జగన్ దిష్టి బొమ్మను దగ్ధం చెయ్యాల్సి ఉంది. దీంతో అప్రమత్తమైన పోలీసులు వినుత ఇంటివద్ద పోలీసులను మోహరించి నిర్బంధించారు. దీంతో ఆమె స్వగృహం వద్దే పది తలల జగన్ దిష్టి బొమ్మను తగలబెట్టారు. పోలీసులు వెంటనే దిష్టిబొమ్మ పూర్తిగా కాలకుండా అడ్డుకున్నారు. శాంతియుతంగా, రాజ్యాంగ బద్ధంగా నిరసన తెలిపినా కూడా పోలీసులు అడ్డుకోవడం హేయమైన చర్యని వినుత మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే మధుసూధన్ రెడ్డి బర్త్ డే పార్టీ చేసుకోవడానికి ఇచ్చిన అనుమతి, జనసేన నిరసన తెలపడానికి ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు.

జనసేన నేత చెంప చెల్లు

సీఎం జగన్ దిష్టి బొమ్మను తగలబెట్టే ప్రయత్నం చేసిన జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి కొట్టే సాయిప్రసాద్ చెంప చెల్లనిపించారు వన్‌టౌన్ సీఐ అంజూయాదవ్. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇటీవల గ్రామ, వార్డు సచివాలయ వాలంటీరు వ్యవస్థ గురించి విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను ఖండిస్తూ వైసీపీ నేతలు, వాలంటీర్లు పలుచోట్ల నిరసనలు చేపట్టారు. కొన్నిచోట్ల పవన్ కల్యాణ్ దిష్టి బొమ్మలు కూడా దహనం చేశారు. ఇందుకు ప్రతిగా జనసేన ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ దిష్టిబొమ్మ దహనం చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా తిరుపతి జిల్లా జనసేనపార్టీ జిల్లా కార్యదర్శి కొట్టే సాయిప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి పట్టణ నడిబొడ్డున పెళ్లిమండపం వద్ద నిరసన కార్యక్రమం చేయడానికి ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ అంజూయాదవ్ తన సిబ్బందితో పెళ్లిమండపం వద్దకు చేరుకున్నారు. జనసేన కార్యకర్తలు చేపట్టిన నిరసన కార్యక్రమం అడ్డుకున్నారు. అయితే జనసేన కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు వారించినా వారు నినాదాలు ఆపలేదు. ఇందుకు ఆగ్రహించిన సీఐ అంజూయాదవ్ అందరూ చూస్తుండగానే జనసేన జిల్లా కార్యదర్శి కొట్టే సాయిప్రసాద్ రెండు చెంపలు చెళ్లు మనిపించింది. ఈ సంఘటనపై ఆమెను వివరణ కోరగా జనసాంద్రత ఉండే ప్రదేశంలో, పోలీసులు పెనుగులాడుతున్నా కూడా దిష్టిబొమ్మకు నిప్పుపెట్టే ప్రయత్నం చేయడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉంటుందని భావించి ఆయన్ను వారించే క్రమంలో అలా చేయడం జరిగిందని తెలిపారు.

జనసేన జిల్లా కార్యదర్శి సాయిప్రసాద్‌పై చేయి చేసుకుంటున్న కొడుతున్న సిఐ అంజుయాదవ్

ఫ్రెష్ బస్సు దృష్టి ప్రశంసనీయం

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

ప్రజాశక్తి- తిరుపతి సిటీ
బెంగుళూరు-తిరుపతి మార్గంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫ్రెష్ ఈవి బస్ ఫ్లీట్‌ను కేంద్ర రోడ్డు రవాణా, హైవేస్ శాఖ మంత్రి నితిన్ గడ్కరీ జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక తాజ్ హోటల్ వద్ద బుధవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రికల్ బస్సులు వలన కాలుష్యం తగ్గుతుందని అన్నారు. డీజిల్, ముడి చమురు దిగుమతిపై ఆధారపడటాన్ని కూడా తగ్గుతుందన్నారు. పర్యావరణ అనుకూల రవాణాను ప్రోత్సహించడం, కర్బన ఉద్గారాలను తగ్గించడం కోసం ఈ కార్యక్రమం ఒక ముఖ్యమైన ముందడుగు అన్నారు. కస్టమర్ అనుభవం, భద్రత, ఆవిష్కరణలపై ఫ్రెష్‌బస్ దృష్టి ప్రశంసనీయమన్నారు. అనంతరం ఫ్రెష్ బస్ వ్యవస్థాపకుడు సుధాకర్ రెడ్డిచిర్రా మాట్లాడుతూ దేశాభివద్ధికి స్వచ్ఛమైన ఇంధన పరిష్కారాలను ప్రోత్సహించడంలో నిబద్ధతతో కషి చేస్తున్నందుకు మంత్రికి కతజ్ఞతలు తెలియజేశారు. ఫ్రెష్ బస్సు హరిత భారతదేశం దిశగా ముందడుగు వేస్తుందన్నారు. తమ ఎలక్ట్రిక్ బస్సులు అత్యాధునిక సాంకేతికతను కలిగి ఉంటాయి, ఇవి ప్రయాణీకుల సౌకర్యాన్ని పెంచడమే కాకుండా కఠినమైన నాణ్యతా ప్రమాణాలను కూడా కలిగి ఉంటాయని, టెయిల్‌పైప్ ఉద్గారాలను తొలగించడం ద్వారా, ఈ బస్సులు వాయుకాలుష్యాన్ని తగ్గించడానికి, పౌరుల మొత్తం జీవననాణ్యతను మెరుగుపరచడానికి గణనీయంగా దోహదపడతాయి. ఒక్క ఫ్రెష్ బస్సు 90,000 లీటర్ల డీజిల్ ఒక సంవత్సరం వ్యవధిలో ఆదా చేస్తుందన్నారు. దాదాపు 200టన్నుల సిఓ2 ఉద్గారాలను తగ్గిస్తుంది. ఇది పర్యావరణంపై దాదాపు 10,000 చెట్ల ప్రభావానికి సమానమని అన్నారు. తిరుపతి కాణిపాకం మధ్య మరో ఎలక్ట్రికల్ బస్సుని కూడా మంత్రి ప్రారంభించారు. ఈకార్యక్రమంలో రోడ్డు భవనాల శాఖ కమిషనర్ ప్రద్యుమ్న, జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి, జాయింట్ కలెక్టర్ బాలాజీ, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, తుడా కార్యదర్శి లక్ష్మి, అధికారులు, రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఎంపీ గురుమూర్తి, రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ కార్యదర్శి ప్రద్యుమ్న, జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, జెసి డికె బాలాజీ, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, ఎన్‌హెచ్ఏఐ ఆర్ఓ, విజయవాడ రాకేష్ కుమార్ సింగ్, ఎన్‌హెచ్ఏఐ అడ్వైసర్ ప్లాంటేషన్ ఏకే జైన్, ఎన్‌హెచ్ పిడి.వెంకటేశ్వర్లు, సిఈ ఎన్‌హెచ్ రామచంద్ర, మోర్త్ ఆర్ఓ బెహ్రా, జిల్లా ఆర్ అండ్ బి అధికారి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

తిరుమలకు చేరుకున్న కేంద్రమంత్రి గడ్కరీ

తిరుమల: తిరుమల శ్రీవారి దర్శనార్థం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ బుధవారం రాత్రి చేరుకున్నారు. ఆయనకు టిటిడి ఈఓ ఏవి ధర్మారెడ్డి స్వాగతం పలికి బస ఏర్పాట్లను చేశారు. గురువారం ఉదయం ఆయన దర్శనం చేసుకోనున్నారని టిటిడి అధికారులు తెలిపారు. ఈవో వెంట జేఈఓ వీరబ్రహ్మం ఉన్నారు.



17న శ్రీవారి ఆలయంలో ఆణివార ఆస్థానం

ప్రజాశక్తి- తిరుమల:
తిరుమల శ్రీవారి ఆలయంలో జూలై 17వ తేదీన సాలకట్ల ఆణివార ఆస్థానం పర్వదినం ఘనంగా జరుగనుంది. సాధారణంగా ప్రతి సంవత్సరం సౌరమానం ప్రకారం దక్షిణాయన పుణ్యకాలంలో కర్కాటక సంక్రాంతినాడు ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. అయితే సౌరమానాన్ని అనుసరించే తమిళుల కాలమానం ప్రకారం ఆణిమాసం చివరి రోజున నిర్వహించే కొలువు కావడంతో ఆణివార ఆస్థానం అని పేరు. పూర్వం మహంతులు దేవస్థాన పరిపాలనను స్వీకరించిన రోజు అయిన ఈ ఆణివార ఆస్థానం పర్వదినంనాటి నుండి టీటీడీ వారి ఆదాయ వ్యయాలు, నిల్వలు తదితర వార్షిక లెక్కలు ప్రారంభమయ్యేవి. టీటీడీ ధర్మకర్తల మండలి ఏర్పడిన తరువాత వార్షిక బడ్జెట్‌ను మార్చి - ఏప్రిల్ నెలలకు మార్చారు.

ఉత్సవ విశిష్టత

ఈ ఉత్సవం రోజున ఉదయం బంగారువాకిలి ముందు గల ఘంటా మండపంలో సర్వభూపాల వాహనంలో ఉభయదేవేరులతో కూడిన శ్రీ మలయప్పస్వామివారు గరుత్మంతునికి అభిముఖంగా కొలువుకు వేంచేపు చేస్తారు. మరో పీఠంపై స్వామివారి సర్వసైన్యాధ్యక్షుడైన శ్రీవిష్వక్సేనులవారు దక్షిణాభిముఖంగా వేంచేపు చేస్తారు. ఈ ఉత్సవమూర్తులతో పాటు ఆనందనిలయంలోని మూలవిరాట్టుకు ప్రత్యేకపూజలు, ప్రసాదాలు నివేదిస్తారు. 2

జీయ్యంగార్ల వస్త్ర సమర్పణ

తిరుమల పెద్దజీయ్యర్ స్వామి పెద్దవెండితట్టలో ఆరు పెద్ద పట్టువస్త్రాలను తలపై పెట్టుకొని మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా విచ్చేస్తారు. వీటిలో నాలుగింటిని మూలమూర్తికి అలంకరిస్తారు. మిగిలిన రెండు వస్త్రాలలో ఒకటి మలయప్పస్వామివారికి, మరొకటి విష్వక్సేనులవారికి అలంకరిస్తారు. శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు తమ తలకు శ్రీవారి పాద వస్త్రంతో 'పరివట్టం'(చిన్న పట్టుగుడ్డ) కట్టుకొని స్వామివారి ద్వారా బియ్యపు దక్షిణ స్వీకరించి 'నిత్యైశ్వర్యోభవ' అని స్వామివారిని ఆశీర్వదిస్తారు. ఆ తరువాత అర్చకులు తిరుమల పెద్ద జీయ్యర్ స్వామి, చిన్న జీయ్యర్ స్వామి, టీటీడీ తరపున కార్యనిర్వహణాధికారికి 'లచ్చన' అను తాళపు చెవి గుత్తిని వరుస క్రమంలో కుడిచేతికి తగిలిస్తారు. హారతి, చందనం, తాంబూలం, తీర్థం, శఠారి మర్యాదలు చేసిన అనంతరం ఆ తాళపు చెవి గుత్తిని శ్రీవారి పాదాల చెంత ఉంచుతారు.

పుష్ప పల్లకీపై ఊరేగింపు

ఆణివార ఆస్థానం సందర్భంగా సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామివారు అత్యంత శోభాయమానంగా అలంకరించిన పుష్పపల్లకీపై తిరుమల పురవీధుల గుండా ఊరేగుతూ భక్తులకు కనువిందు చేస్తారు.

ఆర్జిత సేవలు రద్దు

ఆణివార ఆస్థానం కారణంగా జూలై 17న కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

టీటీడీలో విపత్తుల నిర్వహణపై మాన్యువల్ ముద్రణ

ప్రజాశక్తి-క్యాంపస్
ప్రకృతి విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన విధివిధానాలతో త్వరలో మాన్యువల్ ముద్రిస్తామని టీటీడీ జేఈవో సదాభార్గవి తెలిపారు. తిరుపతిలోని శ్వేత భవనంలో టీటీడీలోని వివిధ విభాగాధిపతులు బుధవారం డిజాస్టర్ మేనేజ్మెంట్ పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జేఈవో మాట్లాడుతూ గతంలో భారీ వర్షాల కారణంగా తిరుమల ఘాట్ రోడ్లలో బండరాళ్లు విరిగిపడి తీవ్రనష్టం వాటిల్లిందన్నారు. ఈ నేపథ్యంలో విపత్తుల నివారణకు చర్యలు చేపట్టాలని టీటీడీ నిర్ణయించిందని తెలిపారు. రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్మెంట్ తరహాలో టీటీడీలోను ప్లాన్ రూపొందించేందుకు చర్యలు ప్రారంభించామన్నారు. ఇందుకోసం యూనిసెఫ్ సంస్థతో కలిసి మాన్యువల్ రూపకల్పన చేశామన్నారు. టీటీడీలోని అన్నివిభాగాలు ఇందులో భాగస్వాములయ్యాయని చెప్పారు. మాన్యువల్ తుదిదశకు చేరుకుందని, త్వరలో విడుదల చేస్తామని వెల్లడించారు. ఈ సమీక్షలో స్టేట్ లెవెల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ ప్రతినిధి నాగరాజు, యూనిసెఫ్ సంస్థ ప్రతినిధి అమల్ కృష్ణ పాల్గొన్నారు. అనంతరం జేఈవో సదా భార్గవి శ్వేత భవనంలో ఎస్సీ, ఎస్టీ, మత్స్యకార వర్గాల వారికి జరుగుతున్న అర్చక శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన అర్చకులతో ముచ్చటించారు.

రాబోవు తెలంగాణ ఎన్నికల్లో
కాంగ్రెస్ విజయం తథ్యం: బట్టి విక్రమార్క



ప్రజాశక్తి- తిరుమల: తెలంగాణ సీఎల్పీనేత మల్లు భట్టి విక్రమార్క బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందన్నారు. దేశంలో ఉచిత విద్యుత్ అంటేనే కాంగ్రెస్ పార్టీ గుర్తుస్తోందన్నారు. ఉచిత విద్యుత్ అంశం బయటకు వచ్చినప్పుడు దానిపై విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఉచితవిద్యుత్‌పై దేశంలో ఎవరు కూడా సాహసం చేయలేదని, అలాంటిది వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2004 సంవత్సరంలో రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చారన్నారు. ఎటువంటి ఆటంకాలు, ఇబ్బందులూ లేకుండా పాదయాత్ర పూర్తి చేశానని భట్టి విక్రమార్క్ చెప్పారు.

ప్రపంచ వేద విజ్ఞాన కేంద్రంగా
శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం

18వ వార్షికోత్సవ సభలో టీటీడీ ఈవో

ప్రజాశక్తి - క్యాంపస్: వేదాలు, పురాణాలు, ఉపనిషత్తులు, ఇతర వైదిక అంశాలకు సంబంధించి ప్రపంచంలో ఎవరికి ఏ సందేహం కలిగినా, ఆధార సహితంగా నివత్తి చేయగలిగే స్థాయికి వేద విశ్వవిద్యాలయం చేరుకోవాలని టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. వేద విద్య, వేద విజ్ఞానం ఆధునిక సమాజానికి అత్యవసరమైన నేటి పరిస్థితుల్లో విశ్వవిద్యాలయం ప్రపంచ చిత్రపటంపై ప్రత్యేకస్థానం సాధించుకోవాలని చెప్పారు. శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం 18వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. సుదర్శన హోమం పూర్ణాహుతి కార్యక్రమంలో ఈవో ధర్మారెడ్డి పాల్గొన్నారు. ఈవో మాట్లాడుతూ వేదవిద్యను విశ్వవ్యాప్తం చేసి సమాజం ధర్మబద్ధంగా నడవాలనే ఉద్దేశంతో టీటీడీ వేద విశ్వవిద్యాలయం ప్రారంభించిందన్నారు. సమాజంలోని రుగ్మతలను రూపుమాపి మంచి వైపు నడిపించే గురుతర బాధ్యతను వేదవిద్యార్థులు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. కలియుగంలో వేద అభ్యాసకుల ద్వారా ధర్మాన్ని నిలబెట్టే ఆలోచనతోనే స్వామివారు వేదవిశ్వవిద్యాలయం ఏర్పాటు చేశారని తాను భావిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు వేదాలను అభ్యసించడమే కాకుండా వేదవిజ్ఞానాన్ని నూతన మార్గంలో ప్రపంచానికి అందించేలా కషి చేయాలన్నారు. అలాగే తాళపత్ర గ్రంథాల్లోని విజ్ఞానాన్ని వెలుగులోకి తెచ్చి ప్రపంచానికి అందించేందుకు కషి చేయాలన్నారు. యూనివర్సిటీ ఆచార్యులు మరిన్ని పరిశోధన ప్రాజెక్టులు వచ్చేలా పని చేసి, రాబోయే రోజుల్లో యూనివర్సిటీ ఆర్థిక అవసరాలు మొత్తం కేంద్ర ప్రభుత్వం అందించేలా కషి చేయాలని చెప్పారు. జేఈవో సదా భార్గవి మాట్లాడుతూ వేదాలకు ఆధునిక పరిజ్ఞానానికి ఉన్న సంబంధాన్ని వివరించే దిశగా వేద విశ్వవిద్యాలయం మరింతగా కషి చేయాలన్నారు. విశ్వవిద్యాలయం అభివద్ధిలో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. దేశంలోని అనేక విశ్వవిద్యాలయాల కంటే ముందుగానే జాతీయ విద్యావిధానాన్ని ప్రవేశపెట్టడం అభినందనీయమన్నారు. అతీంద్రియ విజ్ఞానంపై ప్రత్యేక కోర్సు ఏర్పాటు చేయడానికి జరుగుతున్న ప్రయత్నాన్ని ఆమె అభినందించారు. గత ఆరు నెలల కాలంగా యూనివర్సిటీ అభివద్ధి వైపు పరుగులు పెడుతోందని తెలిపారు. వేద విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ విశ్వవిద్యాలయంగా తయారు చేయడానికి ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య రాధేశ్యాం, పిఆర్ఓ డాక్టర్ బ్రహ్మాచార్యులు, ఆచార్య రామకష్ణ, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

యూట్యూబ్ ఛానల్ ఆవిష్కరణ

వేద విజ్ఞానాన్ని ప్రపంచానికి తెలియజేయడం కోసం శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం ఏర్పాటుచేసిన 'భారతీయ విజ్ఞాన ధార' యూట్యూబ్ ఛానల్‌ను ఈ సందర్భంగా ఈవో ధర్మారెడ్డి, జేఈవో సదా భార్గవితో కలసి ఆవిష్కరించారు. అలాగే విశ్వవిద్యాలయానికి సంబంధించిన సురభి న్యూస్ లెటర్, వర్సిటీ పరిశోధన, ప్రచురణల విభాగం రూపొందించిన హరివంశం రెండవ భాగం, బ్రహ్మసూత్ర భాష్యం మొదటి, రెండవ భాగం పుస్తకాలను ఆవిష్కరించారు.

వీదు టెక్ ప్రారంభం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుపతి నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన వీదు టెక్ ఇన్స్టిట్యూట్ ఆప్ ఫోర్జిన్ లాంగ్వేజ్‌ను బర్డ్ స్పెషల్ డైరెక్టరు డాక్టరు రెడ్డెప్పరెడ్డి, వైఎస్ఆర్‌సిపి సీనియర్ నాయకులు ఎంఆర్‌సి రెడ్డి, కార్పొరేటర్ శేఖర్‌రెడ్డి ప్రారంభించారు. స్థానిక ఆర్‌సి రోడ్డులోని ముబారక్ షాప్ ఎదురుగా రెండో అంతస్తులో ఏర్పాటు చేసిన ఆ సంస్థ వద్ద బుధవారం జరిగిన కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా రిబ్బన్‌కట్ చేసి, జ్యోతిప్రజ్వలన, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆ సంస్థ నిర్వాహకులు అచ్చుత్‌వర్మ, అజయ్ మాట్లాడుతూ విదేశీ భాషల్లో ప్రావీణ్యం కల్పించేందుకు, సులభ పద్ధతిలో ఇంగ్లీషు బోధన, పిల్లలకు వివిధ బాషల్లో పట్టుకల్పించేందుకు ఈ సంస్థను స్థాపించామన్నారు. స్పెయిన్, ఫ్రెంచ్, జర్మనీ, ఇంగ్లీషు భాషలకు ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. స్కూల్ పిల్లలకు డ్యాన్సు, అబాకస్, యోగా, డ్రాయింగ్, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్‌లో ప్రత్యేక శిక్షణ, బోధన అందిస్తామన్నారు. ఐల్ట్స్, టొఫల్, దులింగో వంటి ప్రత్యేక కోర్సులను ప్రవేశపెట్టామన్నారు. లాంగ్‌టర్మ్ కోర్సులు, షార్ట్ టర్మ్ కోర్సులను ఆశక్తిగల వారు సద్వినియోగం చేసుకోవాలని, ఫీజులు సైతం అందరికి అందుబాటులో ఉంటాయన్నారు. దీన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 93927 77593 ఫోన్ నెంబరును సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రుయా ఆసుపత్రి డెవలప్‌మెంట్ కమిటీ వర్కింగ్ చైర్మన్ బండ్ల చంద్రశేఖర్, సూరజ్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ వైసీపీలోనే సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-కేవీబీపురం: అర్హులందరికీ వైసీపీలోనే సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. బుధవారం కేవీబీపురం మండలం ఆరె గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను గ్రామస్థులు గజమాలతో ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి జగనన్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. లేదా అడిగి తెలుసుకున్నారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలోనే అందరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని.. టీడీపీ ప్రభుత్వంలో పార్టీ నాయకులు ఎవరికి చెబితే వారికి.. జన్మభూమి కమిటీ సంతకాల కోసం కాళ్లరిగేలా తిరగడం చూశామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థతో ఇంటికే పథకాలను అందిస్తున్నారని.. కనీసం సర్టిఫికెట్లు కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా జగనన్న సురక్ష కార్యక్రమంలో 11 రకాల సర్టిఫికెట్లను ఇంటివద్దనే అందించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో హిస్టరీ అకాడమీ డైరెక్టర్ గవర్ల కృష్ణయ్య, ఎంపీపీ మునిలక్ష్మి నందకుమార్, వైస్ ఎంపీపీ సరస్వతి, శీనుయాదవ్, జడ్పిటిసి మూర్తిర, మునెమ్మ, సుబ్బయ్య, ముదిరాజా కార్పొరేషన్ డైరెక్టర్ ధనుంజయ రెడ్డి, ఫైనాన్స్ డైరెక్టర్ వసంత లాల్‌బాబు యాదవ్, మహిళా అధ్యక్షురాలు బుర్ర మాధవి, సర్పంచులు అధ్యక్షుడు రాము, ఏపీ మోడల్ స్కూల్ ఛైర్మన్ హరిబాబు, సచివాలయ కన్వీనర్ శాస్త్రి రాజు, రాయపేడు హరి, నాగయ్య, జగదీష్, బాలసుబ్రమణ్యం, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కళ్యాణ్ క్షమాపణ చెప్పకుంటే ఉద్యమం

ప్రజాశక్తి-పాకాల: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ మహిళలకు.. వాలంటీర్లకు క్షమాపణ చెప్పాలని.. లేకుంటే ఉద్యమం చేస్తామని వైసీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నంగా పద్మజారెడ్డి అన్నారు. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ కు వ్యతిరేకంగా బుధవారం పాకాల పట్టణంలో వాలంటీర్లతో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు జాతిపిత మహాత్మా గాంధీని అవమానించే విధంగా ఉన్నాయని, వాలంటీర్లపై చేసిన వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచులు ధనలక్ష్మి, కస్తూరి, ఎంపీటీసీలు, నాయకులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

గూడూరు టౌన్: కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా సేవలు అందించిన వాలంటీర్లపై పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని..వెంటనే వాలంటీర్లకు ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ గూడూరు పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయేషా, కాటమ్మ, సూర్య, శ్రీనాథ్, సురేంద్ర, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కేకేసీలో ఉచిత వైద్య సేవలు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పరమేశ్వర మంగళంలోని కేకేసీ ఆయుర్వేద ఆసుపత్రి ఆధ్వర్యంలో నారాయణవనం మండలంలోని దిగువ కనకపాళెం గ్రామంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 120 మంది రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. విద్యా సంస్థల వైస్ ఛైర్మన్ నరసింహారావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ మంజుల. సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.మునిలోకేష్, డిప్యూటీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.జ్యోత్స్న పాల్గొన్నారు.

నా బిడ్డను ఆశీర్వదించండి: చెవిరెడ్డి లక్ష్మి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాబోయే 2024 ఎన్నికల్లో చంద్రగిరి నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పోటీ చేస్తున్నారని, ఈ సార్వత్రిక ఎన్నికల్లో నా బిడ్డను ఆశీర్వదించాలని చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి కోరారు. బుధవారం మంగళం పరిధిలోని తిరుమల నగర్ పంచాయతీలోని శేషాచలనగర్‌లో ఆమె ఇంటింటి పాదయాత్రను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు చెవిరెడ్డి లక్ష్మిని ఆప్యాయంగా పలకరిస్తూ ఆహ్వానం పలికారు. పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు.

108 వాహనంలోనే ప్రసవం

ప్రజాశక్తి-బాలాయపల్లి: 108 వాహనంలోనే సిబ్బంది ఓ మహిళకు పురుడు పోసిన సంఘటన మండలంలోని కయ్యూరు పంచాయతీ వేణు గోపాలపురం గిరిజన కాలనీలో బుధవారం చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు వేణుగోపాలపురం గిరిజన కాలనీకి చెందిన వనితకు పురుటి నొప్పులు రావడంతో 108కు సమాచారం అందించారు. 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా కయ్యూరు సమీపంలో ఎక్కువగా పురుటినొప్పులు రావడంతో సిబ్బంది ప్రసవం చేయించి తల్లీబిడ్డను క్షేమంగా గూడూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రసవం చేసిన వారిలో 108 టెక్నీషియన్ గోవింద్, డ్రైవర్ వైసీ ప్రసాద్, ఆశ కార్యకర్త కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

అడ్వాన్స్ నగదుతో పనులు ప్రారంభించండి

ప్రజాశక్తి-బాలాయపల్లి: పక్కాగృహాలు మంజూరు అయినా లబ్ధిదారులు ఇంతవరకు పనులు ప్రారంభించకపోతే తాము అడ్వాన్సుగా డబ్బులు ఇస్తామని.. పనులు ప్రారంభించాలని హౌసింగ్ ఈఈ మోహన్‌రావు తెలిపారు. బుధవారం మండలంలోని మన్నూరు, చుట్టి, పచ్చరుచేను గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న జగనన్న పక్కా గహల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరితగతిన గహ నిర్మాణాలు పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ జహీరుద్దీన్, ఏఈ మనపాటి రాజా, వర్క్‌ఇన్‌స్పెక్టర్ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

గోపాల్ రెడ్డి మృతికి నివాళులు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: నేసనూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త విజయ్ తండ్రి గోపాల్‌రెడ్డి బుధవారం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న చిత్తూరు పార్లమెంటు ఉపాధ్యక్షులు గంజి మాధవయ్య, మండల పార్టీ అధ్యక్షులు రవికుమార్ గ్రామానికి చేరుకుని నివాళులు అర్పించారు. వారివెంట బాలాజీ, భాస్కర్ నాయుడు, బాలకృష్ణ, గట్టు శివ, సుబ్బు, మోహన్, వెంకటేష్, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

నూతన కల్వర్టు ప్రారంభం

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు మండల పరిధిలోని తిప్పవరపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన కల్వర్టును గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు ప్రారంభించారు. ఎన్నో ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న సమస్యను పరిష్కరించినందుకు గ్రామస్థులు, రైతులు ఎమ్మెల్యేకి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ పార్టీ నాయకులు దేగపూడి కృష్ణారెడ్డి, కార్యకర్తలు, ఐసీడీఎస్ ఫౌండేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేపర్ సంచులపై అవగాహన

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు రెండో పట్టణ పరిధిలోని వి.యస్.ఆర్ పాఠశాలలో ప్రపంచ పేపర్ బ్యాగ్ డే దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ బాలకష్ణంరాజు మాట్లాడుతూ ప్లాస్టిక్ బ్యాగ్ వాడకంతో పర్యావరణానికి పెనుముప్పు ఉంటుందని.. పేపర్ బ్యాగ్‌తో కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ అన్నపూర్ణ, ప్రిన్సిపల్ శాంత కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాక్‌మెన్ ఇండస్ట్రీలో ఉద్యోగ అవకాశాలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఏర్పేడు పరిధిలోని రాక్ మెన్ ఇండస్ట్రీలో ఇంజనీరింగ్ టెక్నీషియన్స్ ఉద్యోగాలకు ఏదైనా బీటెక్ డిప్లమా (సివిల్ ఇంజనీర్లు తప్ప) పూర్తిచేసిన పురుష అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోవాలని డీఆర్డీఏ పీడీ ఏడీ జ్యోతి తెలిపారు. ఈ ఉద్యోగాలలో ఎంపికైన వారికి రూ.18 వేలు నెలసరి వేతనం ఇస్తారన్నారు. సంవత్సరం పాటు ఉద్యోగం చేసిన వారిని అసిస్టెంట్ ఇంజనీర్‌గా పదోన్నతి కల్పిస్తారన్నారు. ఫ్రెషర్, సీఎన్‌సీ ఆపరేటింగ్, డై కాస్టింగ్ రంగాలలో 1 నుంచి 4 సంవత్సరాలు అనుభవం కలిగిన వారు అర్హులన్నారు. అభ్యర్థులు తమ ఫోన్‌చేసి వారి పేరు, వివరాలను నమోదు చేసుకోవాలని, రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ఈనెల 17న తిరుపతి టిటిడిసిలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్‌నంబరు 9160912690ను సంప్రదించాలని కోరారు.

ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-వెంకటగిరి: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఈనెల 21వ తేదీన వెంకటగిరి రానున్న సందర్భంగా అధికారులు హెలిప్యాడ్ స్థల పరిశీలన బుధవారం చేశారు. వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలోని మూడు ప్రాంతాలలో విశ్వదయ కాలేజీ గ్రౌండ్, టిటిడి కళ్యాణ మండపం ఎదురుగా ఉన్న స్థలం, ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల, ప్రాంతాలను పరిశీలించారు. మాజీ ముఖ్యమంత్రి జనార్ధన్‌రెడ్డి విగ్రహ ఏర్పాటుకు జరుగుతున్న పనులను చూశారు. వైసీపీ సీనియర్ నాయకులు నెమలిపూడి సురేష్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య, తహశీల్దారు పద్మావతి, ఎంపీడీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో దిగుబడులు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: యాజమాన్య పద్ధతులతో మామిడిలో దిగుబడులు సాధ్యమని.. పూత, పిందె దశలోనే మం దులు పిచికారీ చేయా లని శాస్త్రవేత్త చక్రధర్ పేర్కొన్నారు. బుధవారం కేబీఆర్‌పురం గ్రామంలో కోరమాండల్ గ్రోమోర్ ఎరువుల కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వ హించారు. మామిడి తోటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. సుధీర్ బాబు, భానుప్రకాష్, మధు, రమేష్ బాబు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ

ప్రజాశక్తి- తొట్టంబేడు: పేద విద్యార్థుల చదువుకు అన్ని వేళలా సాయంగా ఉంటానని ప్రముఖ సంఘ సేవకులు, జాతీయ వినియోగదారుల హక్కుల కమిషను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలవగుంట భరత్ రెడ్డి భరోసా ఇచ్చారు. తొట్టంబేడు మండలం ఇలగనూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి ఐదో తరగతి చదివే విద్యార్థులకు బుధవారం విద్యా సామాగ్రి, స్వీట్లు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు రమేష్, సుజాత, పాత్రికేయులు బాలు, నితీష్, గ్రామస్థులు వెంకటాద్రి, నరసింహులు, ముని కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సంచార జాతుల అభివృద్ధి నిధులు విడుదల చేయాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): దేశంలోని సంచార జాతులు ఆర్థికంగా చైతన్యం కావడానికి కేంద్ర ప్రభుత్వం సీడ్ పథకం ప్రవేశపెట్టిందని, ఇప్పటివరకు సంచార జాతుల అభివద్ధి కోసం ఎటువంటి నిధులు మంజూరు చేయలేదని.. వెంటనే నిధులు మంజూరు చేయాలని అఖిల భారత సంచార జాతుల అభివద్ధి మండలి రాష్ట్ర కోర్ కమిటీ ఛైర్మన్ రాపూరు డోలాక్రిష్ణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓబీసీ కమిషన్ జస్టిస్ రోహిణి ఇచ్చిన నివేదిక ఆధారంగా డిఎన్టిల ప్రత్యేక రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంచార జాతుల అభివృద్ధి మండలి జిల్లా అధ్యక్షులు వెంకటసుబ్బయ్య, గౌరవ అధ్యక్షులు పగడాల ప్రసాద్, ప్రధాన కార్యదర్శి గంగాధరం, సహాయ కార్యదర్శులు ఓంకార్, రమేష్, చంద్రశేఖర్, నాగరాజు ఆదినారాయణ, లోకనాథ్ తదితరులు పాల్గొన్నారు.

17 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రెండు వేర్వేరు ప్రాంతాల్లో 17 ఎర్రచందనం దుంగలు, కారు స్వాధీనంతో పాటుగా ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. డీఎస్పీ మురళీధర్ ఆధ్వర్యంలో ఆర్ఐలు సురేష్ కుమార్‌రెడ్డి, చిరంజీవులు బందాలు నెల్లూరు జిల్లా రాపూరు, రాజంపేట జిల్లా రోళ్ల మడుగు వద్ద మంగళవారం దాడులు నిర్వహించారు. సురేష్ కుమార్‌రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐ వినోద్‌కుమార్ బందం తిరుపతి నుంచి రాపూరు చేరుకుని, గోనుపల్లి సెక్షన్ లో కూంబింగ్ చేపట్టగా కోటూరుపల్లి చెరువు గట్టు వద్ద కారు కనిపించింది. అందులోకి 3 ఎర్రచందనం దుంగలు లోడ్ చేస్తున్న వారిని పట్టుకొని విచారించగా తమిళనాడు కల్లకురిచ్చి జిల్లాకు చెందిన వారిగా గుర్తించామన్నారు. చిరంజీవులుకు చెందిన ఆర్ఎస్ఐ మురళి బందం రాజంపేట జిల్లా సానిపాయ నుంచి కూంబింగ్ చేపట్టగా, రోళ్లమడుగు వద్ద కొందరు ఎర్రచదంనం దుంగలను మోసుకుని వెళుతున్న వారిని చూసి పట్టుకునే ప్రయత్నం చేయగా వారు ఎర్రచందనం దుంగలను పడేసి పారిపోయారన్నారు. ఈ సంఘటన స్థలంలో 14 ఎర్రచందనం దొంగలను స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ మురళీధర్ చెప్పారు. స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగల విలువ దాదాపు రూ.10 లక్షలు ఉంటుందని వివరించారు. ఈ రెండు సంఘటనలపై తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీస్ స్టేషన్లో సిఐ జి.శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు. ప్రతిభ కనబరిచిన టాస్క్ ఫోర్స్ సిబ్బందికి కర్నూలు రేంజి డిఐజి సెంథిల్ కుమార్ రివార్డులను ప్రకటించారన్నారు.

షాలిషా కుటుంబ సభ్యులకు సీపీఎం పరామర్శ

ప్రజాశక్తి-గూడూరు టౌన్: ఇటీవల గూడూరు పురపాలక పరిధిలోని చెన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్‌గా విధులు నిర్వహిస్తున్న షాలిషా వైద్యాధికారి వేధింపులతో సోమవారం ఆత్మహత్యయత్నం చేసుకుంది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం నెల్లూరులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సీపీఎం పార్టీ నాయకులు బుధవారం గూడూరు పట్టణంలోని శాంతినగర్‌లో ఆమె నివాసానికి చేరుకుని పరామర్శించారు. కార్యక్రమంలో గూడూరు సీపీఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్, ఆటో యూనియన్ కార్మికులు బి.వి.రమణయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

ప్రజాశక్తి -తొట్టంబేడు: ప్రజాసమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైసీపీ నాయకురాలు బియ్యపు పవిత్రారెడ్డి చెప్పారు. తొట్టంబేడు మండలం పొయ్య సచివాలయ పరిధిలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులే నేరుగా ప్రజల ఇంటి గుమ్మం వద్దకు వచ్చి సమస్యలు అడిగి తెలుసుకుని మరీ వాటిని పరిష్కరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉన్నం నిర్మల, వైసీపీ మండల కన్వీనరు ఉన్నం వాసుదేవనాయుడు, వైస్ ఎంపీపీ మల్లికమ్మ, గెరటారెడ్డి, తహసీల్దారు సుధీర్‌రెడ్డి, ఏఈ అలీ, సర్పంచ్ సక్కుబాయమ్మ, మాధవి, వీరభద్ర, మోహన్, సునీత, ప్రకాష్, నాగేంద్ర, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు తగదు

ప్రజాశక్తి-గూడూరు రూరల్: జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం హేయమైన చర్య అని జనసేన నాయకులు, చిరంజీవి యువత నియోజకవర్గ అధ్యక్షులు సయ్యద్ నయీమ్ అన్నారు. బుధవారం గూడూరు పట్టణంలోని ఆర్అండ్ బీ అతిథిగహం వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ నాలుగేళ్ల పాలనలో అవినీతిలో తప్ప మరెందులోనూ అభివద్ధి కనిపించడం లేదన్నారు. రాష్ట్రంలో 30 వేల మంది మహిళలు మిస్సయ్యారని, రికవరీ తర్వాత మిగిలిన మహిళలు ఏమయ్యారని పవన్ కళ్యాణ్ ప్రశ్నించారన్నారు. అలాగే 50 కుటుంబాలకు ఒక వాలంటీర్‌ను ఏర్పాటు చేసి డేటా మొత్తం సేకరిస్తున్నారని, సేకరించిన డేటాను ఎక్కడ నిక్షిప్తం చేస్తున్నారని ప్రశ్నించినందుకు వాలంటీర్లతో ధర్నా చేయించడం, దిష్టిబొమ్మను దహనం చేయించడం వంటి చిల్లర రాజకీయాలను మానుకోవాలన్నారు. ఊడిపోయే ఉద్యోగాలను ప్రభుత్వ ఉద్యోగాలుగా క్రమబద్ధీకరించేందుకు పోరాడాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి చమరగీతం పాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జన సైనికులు నయీమ్, సునీల్, సూర్య, కుమార్, శేషు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి: వాలంటీర్లకు కనీస వేతనం చట్టం వర్తించదా..? ఉన్నత చదువులు చదువుకున్న యువతీ యువకులు తమ జీవిత ఆశయాలను సాధించలేక ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వక నలుగుతున్నారని బుధవారం జనసేన పార్టీ కార్యాలయంలో ఒంగోలు జిల్లా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకటేశ్వర్లు మీడియా సమావేశంలో తెలిపారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఏలూరు వాలంటీర్ల వ్యవస్థను.. కొందరిని ఉద్దేశించి సమాజ వ్యతిరేక చర్యలను ఖండిస్తూ వ్యాఖ్యానించారే తప్ప వారిని కించపరచలేదని అన్నారు. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతన చట్టం ప్రకారం రూ.15 వేలు అమలు చేస్తుంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వాలంటీర్లుగా నియమించి పార్టీ సొంత ప్రయోజనాల కోసం వాడుకుంటూ నెలకు రూ.5 వేలు ఇవ్వడం దారుణమన్నారు. వెంకటగిరిలో కొందరు వాలంటీర్లు గంజాయి వ్యాపారం చేసుకుంటున్నారని.. వారిపై ఎలాంటి చర్యలు లేవన్నారు. జనసేన వీర మహిళ చామండి రాధమ్మ మాట్లాడుతూ, వెంకటగిరి పట్టణ అధ్యక్షుడు రామారావు అనిల్, పట్టణ ప్రధాన కార్యదర్శి పఠ్వీరాజ్ , సొరాయపాలెం శేఖర్ , కార్యదర్శి రిజ్వాన్ భాషా, వెంకటరమణ, జనసేన కార్యకర్తల పాల్గొన్నారు.

సర్టిఫికేట్స్ పోయినవి

నేను ఈ దినమున తేది.29-06-2023 న ఇంటర్వ్యూ నిమిత్తము మేనకూరు సెజ్ కు వెళ్ళి తిరిగి ఆటోలో వస్తుండగా నా స్కూల్ సర్టిఫికేట్స్ ఇంటర్‌మీడియట్, పదవతరగతి మార్కులిస్టులు పోగొట్టుకున్నాను. ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణములో విచారించగా ఎవరికి తెలియదని చెప్పారు. కావున కామందువారు నా మీద దయుంచి నాకు నకలు సర్టిఫికేట్స్ యిప్పించవలసినదిగా కోరుచున్నాను.

10 th : 4108959
12 th : 8168095

ఇట్లు,
తమవిధేయుడు
చిట్టేటి చంద్రశేఖర్,
ఆర్ముగంనగర్, ఎల్.ఐ.సి రోడ్డు,
నాయుడుపేట, తిరుపతి జిల్లా.
సెల్ :9840260511

In the Court of the Principal Junior Civil Judge : Gudur

E.P.No. 27 / 2018
O.S.No. 107 / 2015

P.L.Narasamma - D.H.R
Vs
1. Vuppu Rajamma
and 2 others - J.D.Rs

Notice To 2nd J.D.R

Vuppu Gopi @ Sk. Rafi,
S/o **Ankaiah** (Late), at present S/o. S.K. Jilani Basha, Working as Can Boy, Gafoor water plant. R/o Amara Gradens, Near Gafoor water plaint, Naidupeta Town, Tirupathi District.

పై నెంబరు కేసులో డిక్రీ హోల్డర్ మీ మీద పై వారి కోర్టులో ఇ.పి. దాఖలు చేసియున్నారు. సదరు ఇ.పి.లో మీకు సేల్ నోటీసు నిమిత్తం **తే28-7-2023ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు **ఉదయం 10.30 గంటలకు** మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పైన తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

ఎ.వి.రాఘవ రెడ్డి, బి.ఎల్.,
డిక్రీ హోల్డర్లు తరపు న్యాయవాది, గూడూరు.
సెల్: **70132 05831**

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రేణిగుంట: రేణిగుంట-పూడి రైల్వే లైను మార్గమధ్యలోని గాజులమండ్యం స్వర్ణముఖి వద్ద బుధవారం గుర్తు తెలియని యువకుడు మతి చెందిన సంఘ టన జరిగింది. మృతి చెందిన యువకుడికి సుమారు 35 సంవత్సరాల వయసు కలిగి ఉంటుందని రైల్వే జీఆర్పీ ఎస్సై అనిల్ తెలిపారు. ముఖం గుర్తుపట్టలేని విధంగా ఉందన్నారు. మృతిచెందిన వ్యక్తి బ్లూ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులు చట్టపరంగా న్యాయం చేయాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: సమీప బంధువుల దాడిలో గాయపడి మతిస్థిమితం కోల్పోయిన తన భర్తకు పోలీసులు చట్టపరంగా న్యాయం చేయాలంటూ శ్రీకాళహస్తి మండలం అరవకొత్తూరు గ్రామానికి చెందిన సుభాషిణి మీడియా ఎదుట వేడుకొంది. తన భర్తపై దాడి చేసిన వారిని శిక్షించే వరకు న్యాయ పోరాటం ఆపనని స్పష్టం చేశారు. బాధితురాలు సుభాషిణి బుధవారం స్థానిక శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ కార్యాలయంలో మీడియా ఎదుట మాట్లాడారు. 'అరవకొత్తూరు గ్రామంలో ఉంటున్న నా భర్త మోహన్ రెడ్డికి, సమీప బంధువులు హేమసుందర్‌రెడ్డి కుటుంబానికి గత 16 ఏళ్లుగా ఆస్తి తగాదాలున్నాయి' అన్నారు. ఈ క్రమంలో మే 11 వ తేదీన వీధిలో నడుస్తున్న తన భర్తపై హేమ సుందర్ రెడ్డి, ఆయన కుటుంబం మారణాయుధాలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని వాపోయారు. దాడిలో తన భర్త తలకు తీవ్ర గాయమై మతిస్థిమితం లేని వ్యక్తిగా మారాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఇరువర్గాలపై చిన్న తగాదా కేసులు పెట్టి చేతులు దులుపుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ తన భర్తపై దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. పైగా రాజీ పోవాలంటూ ఉచిత సలహాలు ఇస్తున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి సమగ్రంగా విచారించి న్యాయం చేయాలంటూ సుభాషిణి ప్రాధేయపడ్డారు.

లక్ష్మమ్మ కుటుంబానికి పరామర్శ



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్: కాపుగున్నేరి పంచాయతీ ఇసుకగుంట గ్రామంలో నివాసం ఉంటున్న మద్దు లక్ష్మమ్మ అనారోగ్యంతో బుధవారం మరణించింది. విషయం తెలుసుకున్న రాచగున్నేరి పంచాయతీ మాజీ సర్పంచ్, జె.కె స్టీల్స్ అధినేత బొల్లినేని జగన్నాథం నాయుడు లక్ష్మమ్మ భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళు లు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. కార్యక్రమంలో బొల్లినేని జగన్నాథం నాయుడు అనుచరులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఫిర్యాదు

ప్రజాశక్తి-పెళ్లకూరు: పెళ్లకూరు మండలంలోని శిరసనంబేడు రాజుపాలెం గ్రామంలో సర్వే నంబర్ 341-బి1 లో గ్రామ అవసరాలకు ఉంచిన 3 ఎకరాల భూ విషయమై బుధవారం గ్రామస్థులు తహశీల్దారుకు ఫిర్యాదు చేశారు. గత 5 సంవత్సరాలుగా బెల్లంకొండ అంకయ్య ఆ భూమిని ఆక్రమించుకొని సాగుచేసుకుంటుండగా గ్రామస్థులు అభ్యంతరం తెలపడంతో గ్రామ అవసరాలకు హద్దులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అయితే సంబంధం లేని కొంతమంది వ్యక్తులు ఆక్రమించి కంచె వేసుకున్నారని.. ఈ విషయమై బెల్లంకొండ అంకయ్య, అమరావతిలతో పలువురు వినతి పత్రం అందించి న్యాయం చేయాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీల వితరణ

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని చెర్లోపల్లి హరిజనవాడ అంగన్వాడీ కేంద్రానికి అదే గ్రామానికి చెందిన దాతలు బుధవారం కుర్చీలు, కుక్కర్లు, ఆయిల్ బాక్సులు, సెట్ బాక్సులు వితరణగా అందించారు. ఈ సందర్భంగా దాతలు హరిశ్రీ, భార్గవి, చిత్ర మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మంచి పౌష్టికాహారం అందించాలని.. పిల్లలకు అవసరమైన వస్తువులను అంగన్వాడీ కేంద్రానికి అందించడం తమకెంతో సంతృప్తినిస్తోందని తెలిపారు. గ్రామంలోని పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపాలని కోరారు. కార్యక్రమంలో మహిళా పోలీసు శాంతి, అంగన్వాడీ కార్యకర్త ఉదయగిరి విజయ కుమారి, సహాయకురాలు నాగమణి, ఆశా కార్యకర్త మాధవి తదితరులు పాల్గొన్నారు.

Before The V Addl. Motor Accident Claims Tribunal : Nellore

M.V.O.P.No. 141 / 2021

Kondaiahgari Gundalaiah - Claimant
Vs
1. M. Sudheesh Kumar
and 2 others - Respondents

Notice to 2nd Respondent

The Managing Director, PRM Road Ways, represented by **R.M. Vignesh Babu** and having it's office is situated at D.No.3/284, Karurmedu Village, Tada Mandal, SPSR Nellore District.

పై నెంబరున క్లయిమెంట్ మీపై నష్టపరిహారము కోరుతూ పైతెలిపిన కోర్టులో పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే01-08-2023ది**కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదారోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పైతెలిపిన కోర్టులోహాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

టి.వి. కళ్యాణ్ కుమార్, బి.ఎ., బి.ఎల్.,
క్లయిమెంట్ తరపు అడ్వకేట్, నెల్లూరు.